# మార్పు

-పెరుమాండ్ల శ్రీదేవి

"ఎలా వుందిరా నీ ప్రిపరేషన్, ఈ సారయినా మంచి రాంక్ వస్తుందా లేదా" కొడుకును అడిగాడు రామారావు.

తండ్రి ప్రశ్నకు మొహం కాస్త చికాకుగా పెట్టుకున్నాడు వినోద్. అయినా సమాధాన మివ్వాలి కాబట్టి "నా ప్రయత్నమయితే నేను చేస్తున్నాను. ఆ పైన మీ అదృష్టం" కాస్త నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు వినోద్.

కొడుకు సమాధానంతో రామారావుకి అరికాలు మంట నెత్తికెక్కింది.

నా అదృష్టమేంట్రా... నా అదృష్టం. రేపు సీటొచ్చి ఎంబిబిఎస్ చేసి డాక్టర్ అయితే అదృష్టవంతుడివి అయ్యేది నువ్వా, నేనా. కొడుకు నిర్లక్ష్యమైన సమాధానం జీర్ణించుకోలేక తీవ్రంగా అన్నాడు రామారావు.

"ముమ్మాటికీ మీరే. ఎందుకంటే ఈ చదువు 'ఈ ఎంట్రెన్స్' ఈ కోచింగ్‌లు ఇవన్నీ మీ ఇష్ట ప్రకారం నా మీద బలవంతంగా రుద్దుతున్నారు. అంతేకాని ఈ చదువు నేనెప్పుడూ కోరుకోలేదు. నేను చదవాలనుకున్నదేంటో నా ఆశయమేంటో మీకు ముందుగానే తెలియచేశాను. కాని మీరు వినలేదు.

బలవంతంగా మీరు కోరుకున్న ఎమ్‌సెట్‌ను నా మీద మోదారు. ఇందులో నేను విజయం సాధిస్తానో లేదో నాకు తెలీదు. అప్పుడే రెండు సార్లు విఫలమయ్యాను. ఒక వేళ చివరగా నేను విజయం సాధించినా ఇది మీరు కోరుకున్న చదువు కనుక మీరే అదృష్టవంతులవుతారు. అంతేకానీ మీ మొండితనానికి నా ఇష్టాన్ని ఆశయాన్ని చంపుకున్న నేనెలా అదృష్టవంతుడిని అవుతాను. దురదృష్టవంతుడినే అవుతాను కాని" అదే ధోరణిలో సమాధానమిచ్చాడు వినోద్.

"అంటే నీ ఇష్టాన్ని అణిచి వేసి నేను నీ పట్ల నియంతలా వ్యవహరిస్తున్నానంటావు". "అదేదో మీకే తెలియాలి" అంటూ ప్లేట్‌లో చేయి కడుక్కుని తన గదిలోకి వెళ్ళాడు వినోద్.

కొడుకు సమాధానంతో చిరాకెత్తిన రామారావు పక్కనే ఉండి టిఫిన్ వడ్డిస్తున్న భార్య మీదికి గయ్‌మని లేచాడు.

"చూశావా, వాడి పొగరు. వాడి సమాధానం. తండ్రి అంటే ఏమన్నా గౌరవం వుందా వాడికి. ఉంటే అలా ఎందుకు మాట్లాడతాడు. అవునులే పెంపకం ఎవరిది నీదే కదా. ఇంకెలా మాట్లాడతాడు" అన్నాడు మండి పడుతూ.

భర్త ధోరణి తెలిసిందే కావడంతో మౌనంగా అతనికి టిఫెన్ వడ్డించింది జానకి. అక్కడి నుండి వెళ్ళిపోతూ అంది. "వాడికి మీ మీద గౌరవం ఉంది కాబట్టే వాడికి ఇష్టం లేని చదువు పట్టుకుని వేలాడుతున్నాడు. ఇంకా మీరు వాడిని విసిగించి మీ మీద వాడికి ఉన్న కాస్త గౌరవాన్ని పోగొట్టుకోకండి".

జానకి వెళ్ళిపోయింది. టిఫిన్ తినబోయిన రామారావు భార్య మాటలకి మాన్పడి పోయి ఆమె వెళ్ళిన వైపే చూస్తుండి పోయాడు.

రామారావు ప్రభుత్వ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నాడు. అతని కొలీగ్స్ పిల్లలు అంతా ఎంబిఏలు, ఇంజనీరింగ్‌లు చదువుతున్నారు. రామారావుకి కూడా తన కొడుకుని ఎలాగయినా ఎంబిబిఎస్ చదివించి డాక్టర్‌ని చేసి సొసైటీలో తన స్టేటస్ పెంచుకోవాలని, తన కొలీగ్స్ కంటే ఓ మెట్టు పైనే ఉండాలనీ ఆశ.

కాని వినోద్ విషయానికి వస్తే అతని ఆలోచనలు వేరేగా ఉన్నాయి. అతనిపై తల్లి ప్రభావం బాగా ఉంది.

నీతి నిజాయితీలు అన్యాయాన్ని ఎదిరించాలనేది అతను తల్లి దగ్గరి నుండి నేర్చుకున్నాడు. తన ఆశయాలకు తగినట్టుగా డిగ్రీ కంప్లీట్ చేసి ఎస్ఐ జాబ్‌కు ట్రై చేయాలనుకున్నాడు.

కాని అతడి తండ్రి దానికి అడ్డుపడ్డాడు. ఇంటర్‌లో కూడా బలవంతంగా బైపిసి ఇప్పించాడు కొడుక్కి. ఇంటర్ తరువాత కొడుకుని డిగ్రీలో జాయిన్ కానీయకుండా ఎంసెట్ లాంగ్‌టర్మ్‌ల కోచింగ్ అనీ పార్ట్ టైమ్ కోచింగ్ అనీ కోచింగ్ సెంటర్‌ల చుట్టూ తిప్పడం మొదలుపెట్టాడు. ఫలితం మాత్రం శూన్యం. రెండుసార్లు వినోద్ ఎంసెట్‌లో రాంక్ సాధించలేక పోయాడు.

డబ్బు వృథా అయిందని రామారావు రెండు సంవత్సరాలు కాలం వృథా అయిందని వినోద్ – ఇలా ఇద్దరూ ఒకరి మీద ఒకరు చిటపటలాడుకుంటూనే వుంటారు.

తండ్రీ కొడుకుల గొడవల్ని గమనిస్తూ ప్రేక్షక పాత్ర వహిస్తుంది జానకి.

"ఒరేయ్, రాముడూ" అనుకుంటా లోపలికి వచ్చాడు మాధవరావు. రామారావు మాధవరావు ఇద్దరూ మంచి స్నేహితులు. మాధవరావు సర్వీస్‌లో ఉండగానే కూతురి వివాహం ఘనంగా జరిపించాడు. ఉద్యోగాలు దుర్లభమవుతున్న రోజులు కావడంతో తను వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని కొడుక్కి ఉద్యోగం ఇప్పించి ఏ చీకూ చింతా లేకుండా బాధ్యతలు తీర్చుకుని హాయిగా ఉంటున్నాడు మాధవరావు.

అతన్ని చూడగానే ప్రాణం లేచి వచ్చింది జానకికి.

రండి అన్నయ్య గారూ, బాగున్నారా ఎన్నాళ్లయింది మీరు రాక. చాలా రోజులున్నారే అమ్మాయి దగ్గర అంటూ కుశల ప్రశ్నలు వేసింది మాధవరావుని జానకి.

"అవునమ్మా నెల రోజులు ఉందామని వెళ్ళానా, మూడు నెలలు ఉండిపోయాను. అసలు అమ్మాయి అల్లుడు రానీయ లేదనుకో. ఇంతకీ వీడేడి ఈ రోజు ఆదివారం ఆఫీసుకు సెలవు కదా ఎక్కడికెళ్ళాడు" అన్నాడు మాధవరావు.

"ఆయన కొలీగ్ వాళ్లింట్లో ఏదో పార్టీ ఉంటే వెళ్ళారన్నయ్యా. ఉండండి మీకు కాఫీ తీసుకొస్తాను" అంటూ కిచెన్‌లోకి వెళ్ళి నిమిషాల మీద స్ట్రాంగ్ కాఫీ చేసి తీసుకుని వచ్చి మాధవరావుకు ఇచ్చింది జానకి.

"ఎన్నాళ్లయింది చెల్లమ్మా నీ చేతి కాఫీ తాగి. నా కూతురు చేసిన కాఫీ కూడా ఇంత రుచిగా ఉండదనుకో" అన్నాడు కాఫీ తాగుతూ.

బదులుగా నవ్వింది జానకీ అతనితో ఏదో చెప్పబోయి తటపటాయించి తల దించుకుంది. కాసేపటి తరువాత తలెత్తి మళ్ళీ ఏదో చెప్పబోయి సంకోచంతో మళ్ళీ ఆగిపోయింది జానకి.

కాఫీ తాగుతూ ఇదంతా గమనిస్తున్న మాధవరావు "ఏంటమ్మా, ఏమయినా చెప్పాలనుకుంటున్నావా. నా దగ్గర సంకోచమేంటి చెల్లమ్మా. విషయమేంటో చెప్పు" అన్నాడు కప్పు టేబుల్ మీద పెడుతూ.

విషయం ఎలా కదపాలో తెలీక తికమక పడుతున్న జానకి మాధవరావే అడగడంతో ఆమె ఓ క్షణం భారంగా ఊపిరి తీసుకుని "తన భర్తకీ, కొడుకుకీ మధ్య జరుగుతున్న నిత్యసంఘర్షణ గురించి, వారి మధ్య రోజు రోజుకీ పెరుగుతున్న అభిప్రాయ భేదాల గురించి నెమ్మదిగా వివరించి చెప్పింది జానకి.

"ఇద్దరి మధ్య నేను నలిగి పోతున్నానన్నయ్యా ఆయన మొండితనం గురించి మీకు తెలుసుగా. ఆయనకు నచ్చచెప్పలేను. ఇటు వినోద్‌ను చూస్తే బాధేస్తుంది. అటు తండ్రి కోరుకున్న ఎంసెట్ సాధించలేక ఇటు వాడి ఇష్టమైన చదువు చదవలేక మధ్యలోనే డిప్రెషన్‌కు గురి అవుతాడేమోనని భయంగా ఉంది. ఎలాగయినా ఈ సమస్యను మీరే పరిష్కరించాలన్నయ్యా" దిగులుగా అంది జానకి.

జానకి చెప్పింది పూర్తిగా విని సాలోచనగా తల పంకించాడు మాధవరావు.

"ఇన్నాళ్ళు నాకు ఎందుకు చెప్పలేదమ్మా ఈ విషయం. సరే నేనేదయినా ఉపాయం ఆలోచిస్తాను. నీవేం బాధపడకు. నేను మళ్ళీ సాయంత్రం వస్తాను. వాణ్ని ఎటూ వెళ్ళొద్దని చెప్పు సరేనా" అంటూ బయల్దేరాడు మాధవరావు.

"సరే" నని తల ఊపింది జానకి.

బాల్య స్నేహితుడు, ప్రాణ స్నేహితుడు అయిన మాధవరావు వల్ల నయినా తన భర్తలో మార్పు

రావాలని కోరుకుంది జానకి.

'ఏయ్ పల్లీలబ్బాయి ఇట్రా' కేకేశాడు మాధవరావు పార్క్‌లోని సిమెంట్ చప్టా మీద కూచుంటూ. అతని పక్కనే రామారావు కూడా కూచున్నాడు.

ఇంతలోనే అక్కడికి పల్లీలు అమ్మే అతను వచ్చి చెరో పొట్లం ఇచ్చి డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు.

అవి తింటూ అడిగాడు రామారావు. "ఏంట్రా ఇన్ని రోజులు వెళ్ళావు. అమ్మాయి ఎలా వుంది. అక్కడి విశేషాలు ఏంటి చెప్పవా".

"చెప్పడానికేముందిరా. అమ్మాయి అల్లుడు ఉద్యోగాలకు వెడితే వారు మనుమడు మనమరాలు స్కూల్‌కి వెళ్ళే వారు. సాయంత్రం దాకా ఒక్కణ్ణే కదా. ఎదురింట్లో ఉండే జగన్నాథ్ అనే వ్యక్తితో పరిచయం అయింది. అతనితోనే కాలక్షేపం చేసే వాడిని. అతనో రిటైర్డ్ గవర్నమెంట్ ఎంప్లాయి. చాలా మంచి వాడు కాని జీవితంలో చేసిన ఒక పొరపాటు వల్ల ఈ వయసులో అతను చాలా నష్టపోయాడు' అని ఆగాడు మాధవరావు.

"వివరంగా చెప్పు" కుతూహలంగా అడిగాడు రామారావు.

"చెబుతాను. ముందీ పేపర్‌లో ఈ న్యూస్ చూడు" అంటూ రెండు నెలల క్రితం ఏదో పాత పేపర్‌లోని న్యూస్ చూపెట్టాడు మాధవరావు.

"యువకుని ఆత్మహత్య' అన్న వార్త అది.

"నిన్న సాయంత్రం ఏడు గంటల సమయంలో నగరానికి చెందిన ఇరవై సంవత్సరాల యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ఇంకా సరి అయిన కారణాలు తెలియలేదు. సంబంధిత ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు."

ఇదీ ఆ వార్తలోని సారాంశం. ఆ వార్త చదివి తిరిగి తన స్నేహితునికి పేపర్ ఇచ్చేస్తూ "ఈ పేపర్‌లోని వార్తకి మీ అమ్మాయి ఇంటి ముందు ఉన్న అతనికి ఏంటి సంబంధం" అడిగాడు రామారావు.

"ఉంది కాబట్టే ఆ వార్త చదవమన్నానురా. ఆ వార్తలోని ఆత్మహత్య చేసుకున్న యువకుడు ఎవరో కాదు. ఆ జగన్నాథ్ గారి అబ్బాయే" చెప్పాడు మాధవరావు.

అది విని ఆశ్చర్యపోయాడు రామారావు.

"ఎందుకని ఆ అబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడు" ఆశ్చర్యం నుండి తేరుకుని అడిగాడు.

"ఏముందిరా! ఆ అబ్బాయికేమో ఎంబిఏ చేయాలని కోరికగా ఉండేదట. జగన్నాథ్ కేమో కొడుకును ఎలాగయినా "లా" చదివించాలని, పెద్ద లాయర్‌ని చెయ్యాలని కోరిక.

ఆ అబ్బాయి తన తండ్రికి ఎంత చెప్పినా వినక పోవడంతో చివరికి తండ్రి కోరిక ప్రకారమే "లా" చదవడానికి సిద్ధపడ్డాడు. కాని తనకు ఆసక్తి లేని చదువు కావడంతో ఎంత ప్రయత్నించినా ఎంట్రెన్స్‌లో రాంక్ తెచ్చుకుని సీటు సంపాదించు కోలేక పోయాడు.

"ఇటు తన కోరిక నెరవేర్చుకోలేక పోయానని, అటు తండ్రి కోరిక నెరవేర్చలేక పోయాననే బాధతో డిప్రెషన్‌కు లోనయి ఆత్మహత్య చేసుకున్నాడు" చెప్పడం ఆపి రామారావు మొహంలోకి చూశాడు మాధవరావు.

అప్పటికే రామారావు మొహంలో రంగులు మారాయి. తను కోరుకున్నట్లుగానే తన స్నేహితునిలో అంతర్మథనం మొదలయిందని గ్రహించిన మాధవరావు ఇంకా చెప్పసాగాడు.

"ఈ సంఘటన జరిగినప్పుడు నేను అక్కడే వున్నానురా. చెట్టంత కొడుకుని పోగొట్టుకుని అతను కుమిలి కుమిలి ఏడుస్తుంటే నాకు కూడా చాలా బాధేసిందనుకో. నెల రోజుల పరిచయమే అయినా "అంకుల్" అని పిలిచే ఆ అబ్బాయి నవ్వు ముఖం మరి ఇక కనిపించదంటే నాకు కూడా

## సినీ నటి!

వస్త్ర ధారణలో
ఎంతో పొదుపు!
పారితోషికంలో
ఎంతెంతో మదుపు!!
అంతా నటనే మరి!!!

–గుడిమెట్ల గోపాలకృష్ణ

గుండె తరుక్కుపోయిందిరా.

అయినా దీనికంతటికీ కారణం ఆ అబ్బాయి తండ్రి జగన్నాథే కదా. తన కొడుకు ఆలోచనల్ని అతను ఆమోదిస్తే ఇంత ఘోరం జరిగేది కాదుగా. ఏమంటావురా".

"అవునవును - జరిగేది కాదు" తడబడుతూ అన్నాడు రామారావు.

"ఉన్న ఒక్కగానొక్క కొడుకుని పోగొట్టుకుని ఇప్పుడు కుమిలి పోతే ప్రయోజనం ఏముంటుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమంటే ఇదే కాబోలు".

"అవును అంటే కదా" నీరసంగా అన్నాడు రామారావు.

"అసలు తమ కొడుకులు వారి కిష్టమైన రంగంలో అభివృద్ధి లోకి వస్తే చాలను కోక ఈ తండ్రులంతా ఎందుకురా వారి మీద తమ ఇష్టాల్ని రుద్దుతారు. ఈ కాలంలో అయితే ఇది మరీ ఎక్కువయిపోయింది. అసలు అలాంటి తండ్రుల్ని ఏం చేసినా... మాధవరావు మాటలు పూర్తికానే లేదు, రామారావు చటుక్కున లేచి నిలుచున్నాడు.

"ఏమయిందిరా" మిత్రుడు హఠాత్తుగా లేచి నిలుచునే సరికి విస్తుబోతూ అన్నాడు మాధవరావు.

"ఏం లేదురా నాకు అర్జంట్ పనొకటి ఉంది. అది మరచిపోయి నీతో వచ్చాను. ఆ పని అయ్యాక మళ్ళీ కలుస్తాను నిన్ను, ఏమనుకోకురా వస్తాను" అంటూ అక్కడి నుండి వడివడిగా నడుస్తూ వెళ్ళిపోయాడు రామారావు.

మిత్రుడు వెళ్ళిన వైపే చూస్తున్న మాధవరావు పెదవులపై ఒక గుంభనమైన చిరునవ్వు కదలాడింది.

"ఫరవాలేదు. వాడిలో కొడుకు విషయంలో తను చేస్తున్న తప్పుకు సంబంధించిన అంతర్మథనం మొదలయినట్టుంది" అనుకున్నాడు మనసులో.

"హలో" మాధవరావు గొంతు.

"హలో అన్నయ్యగారూ నేను జానకిని" ఆమె గొంతులో ఆనందం.

"ఆ చెప్పమ్మా ఏంటి విషయం. మా వాడిలో ఏమయినా మార్పు వచ్చిందా".

"కొద్దిగా కాదన్నయ్య గారూ. పూర్తిగా మార్పు వచ్చింది. వినోద్‌ని వాడికి నచ్చిన చదువు చదవమని, వాడికి నచ్చిన రంగాన్నే ఎన్నుకోమని అందుకు ఆయన వాడికి పూర్తి సహకార మందిస్తానని చెప్పారు" ఆనందంగా అంది జానకి.

అది విని ముసిముసిగా నవ్వుకున్నాడు మాధవరావు.

"చాలా థాంక్స్ అన్నయ్య గారు! అడిగిన వెంటనే సహాయం చేశారు. మీరే సహాయం చేయకుంటే ఆయనలో ఈ మార్పు వచ్చేది కాదు. అసలు ఆయనలో ఈ మార్పు ఎలా కలిగింది" అడిగింది జానకి.

మాధవరావు పార్క్‌లో రామారావుకి, తనకు మధ్య జరిగిన సంభాషణంతా వివరంగా చెప్పాడు.

"అవునన్నయ్యా, కాని పాపం ఆ జగన్నాథ్ గారు చెట్టంత కొడుకును పోగొట్టుకుని ఎంత కుమిలిపోతున్నారో కదా" బాధగా అంది జానకి.

"అసలు జగన్నాథ్ అనే వాడు ఉంటే కదమ్మా కుమిలి పోవడానికి" కూల్‌గా అన్నాడు మాధవరావు.

"అంటే" అర్థం కానట్టు అంది జానకి.

"అసలు నాకు మా అమ్మాయి వాళ్ళ ఊళ్లో జగన్నాథ్ అనే వ్యక్తే పరిచయం కాలేదు. పాత పేపర్లు అమ్ముదామని వాటిని బయటికి తీస్తుంటే ఆ వార్త నా కంట పడింది. దానికి చిన్న కథ జోడించి మా వాడికి కొంచెం షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చాను అంతే. కాని ఆ షాక్ వాడికి కాస్త గట్టిగానే తగిలినట్టుంది అన్నాడు మాధవరావు నవ్వుతూ.

అది విని అటు వైపు నుండి జానకి కూడా హాయిగా నవ్వుకుంది. ■

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.